# కొంచెం కొంచెం అమృతం

తెగిపోతుందని తెలిసి కూడా
జీర్ణమై పోయిన చెప్పులే
మనిషి మీద నమ్మకం లాగ
కలల మీద ఆశలాగ.

అరిగిపోయినా అలిసిపోయినా
అలవాటు పడ్డ ప్రాణం
బరువు సమస్తం మోస్తుంది.

ఒళ్లు గుల్ల అయినా
దారంతా కన్నీరు
కాఠిన్యాల ముళ్లు అయినా
ఉన్న గూటిలో
జీవచ్ఛవాలు పేరుకుపోతున్నా
తెగిపోయిన చెప్పు
రోడ్డు మీద తన్న బడుతున్నట్టు
పడుతూ లేస్తున్నట్టున్న ప్రాణం
కల్లు కాంపౌండులో
సేదదీరుతుంది.
తన చుట్టూ జరిగే తంతు
శవానికేం తెలుస్తుంది?
ఎంత అమృతమైతే మాత్రం?
మందులో విషం పెరిగినపుడు
ప్రసార సారాంశాలల్లోను
పతాక శీర్షికలలోను

అదనంగా మరో

రెండు రోజులే బతుకుతుంది

ఈలోగా ఇంకా తెల్లారక ముందే
కాళ్లీడ్చుకుంటూ
చింకి చెప్పు మరొకటి కదులుతుంది
అక్కడికే!
హత్యకో ఆత్మహత్యకో
కొంచెం కొంచెంగా
అలవాటు పడటానికి.